# వేటలో వాటా

శ్రీరాములు రిటైర్డ్ టీచర్. చేతి సంచితో అంత ఎండలో ఉస్సురంటూ వచ్చి బస్‌స్టాపులో నిలబడ్డాడు. అక్కడ మరో నలుగురు యువకులు నిలబడి ఉన్నారు. వాళ్ళు ఉన్నవాళ్లు ఉండకుండా రోడ్డుమీద పోయే అమ్మాయిల్ని ఏడిపిస్తున్నారు.

"అబ్బా చూడరా... భువనైక సుందరి" అన్నాడొకడు. మిగతా వాళ్లంతా నవ్వారు.

రోడ్డుమీద పోతున్న ఒక అమ్మాయి నల్లగా, లావుగా అందవిహీనంగా ఉంది. ఆమెను గేలి చేస్తూ అతనలా అన్నాడు. ఆ అమ్మాయి ఆ మాటలకు తల ఇంకా క్రిందికి దించుకొని నడవ సాగింది.

అది వీళ్ల ఉత్సాహానికి ఇంకో కారణమయింది.

"ఆహా! పెళ్లినడక నడుస్తోందిరా. మన్మథుడక్కడ ఎదురు చూస్తున్నాడేమో"

"ఆ కౌగిలిలోని వెచ్చదనం" ఇంకొకడన్నాడు.

ఆ అమ్మాయి తల ఇంకా అవమానంతో క్రిందికి వాలిపోయింది. గుండెమీద పుస్తకాలను అలాగే అదుముకొని గబగబా నడిచిపోయింది. పాపం ఆ అమ్మాయి ఒక్కతి. వీళ్లు నలుగురు. కాని అమ్మాయిలు నలుగురున్నా ఒక అబ్బాయిని ఏమీ చేయలేరు.

సంఘానికి భయపడుతారు అమ్మాయిలు. కారణం స్త్రీలను ఒక పరిధి గీచి అందులో నిలబెట్టింది సంఘం. వాళ్ళ నెత్తిన రాళ్లేసినా వాళ్లు ఆ పరిధి దాటి ప్రవర్తించ గూడదు. కాని ఇప్పుడు స్త్రీలలో కూడా చైతన్యం వచ్చింది. కాని పూర్తిగా అది అన్ని చోట్లా వ్యాపించలేదు.

నిజానికి ఇలాంటివి జరక్కుండా ఉండాలంటే ఆడవాళ్లే ఇటువంటి రౌడీలను శిక్షించడానికి పూనుకోవాలి. అప్పుడుగాని వీళ్లబుద్ధులు మారవు. కాబట్టి ఆడవాళ్లకు ధైర్యంగా మగవాళ్లని ఎదుర్కొనే శక్తి కలగాలనేది శ్రీరాములు ఆవేదన. ఆ ఆవేదనతోనే ప్రక్కకు చూసాడు. నలుగురు కాస్తా ఇప్పుడు అరడజను మందయ్యారు. అందరూ విద్యార్థులే. నేటి విద్యార్థులు ఇలా తయారై రేపటి పౌరులవుతున్నారన్నమాట అనుకున్నాడు.

ఇంతలో సిటీ బస్సుకోసం కాబోలు ఓ పదిమంది కాలేజి అమ్మాయిలు వచ్చి ఒక ప్రక్కగా నిలబడ్డారు. అందరూ సీతాకోక చిలుకల్లా అందంగా అలంకరించుకొని ఉన్నారు. వాళ్లను చూడగానే అబ్బాయిల్లో ఉత్సాహం ఇనుమడించింది.

"రంభలాగుందిరా ఎర్రపైట పిల్ల"

"దాని ప్రక్కది ఊర్వశి"

"ఆ ప్రక్కన తిలోత్తమ"

"ఆహా! ఏమి వర్ణించినావురా భాయీ. వీళ్లంతా భువినుంచి దివికి దిగివచ్చిన అప్సరలు కదరా. అందుకే ఇంత అందంగా ఉన్నారు."

తలా ఒక మాట అంటున్నారు.

"అప్పటికి మనమేనటోయ్ తక్కువ. మనకంటే సినిమా హీరోలు బాగుంటా రంటావా" ఆ మాటలన్న వాడు జీన్సు వేసుకొని మూతిమీద పొడవైన మీసాలతో కోతిలా ఉన్నాడు.

"అయితే వాళ్లంతా మన హీరోయిన్లే" అన్నారు మిగతా వాళ్లు.

"ఎవరి హీరోయిన్ని వాళ్లు పిలవండి. ఒంటరిగా వచ్చిన వాళ్లం జంటలుగా విడిపోదాం" అన్నా డొకడు.

ఇంత అసభ్యంగా ప్రవర్తిస్తున్నా ఆడపిల్లలు నోరెత్తలేదు తమను కాదన్నట్లు, తమకు వినపడ నట్లు మౌనంగా నిలబడి ఉన్నారు పాపం. నోరెత్తితే అబ్బాయిలు రెచ్చిపోతారని భయం.

కాని వాళ్లు క్షణక్షణానికి పేట్రేగి పోతున్నారు. దానికి తగ్గట్లు బస్సుకుడా రాలేదు. శ్రీరాములకు వాళ్లను చూస్తూంటే కోపం అంతకంతకూ అధికం కాసాగింది.

"రాత్రికి రేటెంత?" అన్నాడు చారల టీ షర్టు వేసుకున్న వాడు ఎర్రపైట అమ్మాయి ధగ్గరకొచ్చి నిలబడి.

అప్పటి వరకూ ఎంతో ఓపిక చూపించిన ఆ అమ్మాయి ఒక ఉండలేక పోయింది.

"నీకు బుద్ధిలేదూ. కుక్కలా నా వెంట పడటానికి" అంటూ పెద్దగా అరచింది.

"నేను నీకు విశ్వసపాత్రుడనైన కుక్కనే. ఇకనాకు బుద్ధి వచ్చిందో లేదో మీరే పరీక్షించండి అమ్మాయిగారూ" ఆమె కెదురుగా నిలబడి వినయంగా తలవంచుకున్నాడు.

"యూ రోగ్. ఇడియట్" అంది ఆ అమ్మాయి విసురుగా.

"ఆహా... హా... ఇదంతా నామీద ప్రేమే."

"షటప్ రాస్కెల్" కోపంగా అంది ఆ అమ్మాయి.

"మీరెన్నయినా తిట్టండి మేడమ్. కాని ఈ ప్రేమదాసుని కరుణించి కొంత ప్రేమ దానం చెయ్యండి."

"ఛ... బుద్ధిలేక పోతే సరి" అంతకంటే ఏమీ అనలేక కళ్లనీళ్లు పెట్టుకుంది. ఆడదాని కోపం ఆడదానికే చేటా?

"ఒరే ప్రవీణ్ ఎందుకురా అది అన్నితిట్టినా నోరు మూసుకొని పడున్నావ్. ఇన్ని తిట్టిన దానికి ప్రతిఫలంగా ఓ కిస్ తీసుకో" హెచ్చరించాడొక హిప్పీ హుషారుగా ఈలవేసి.

'ఇతన్ని ఎక్కడో చూసినట్లుందే' అనుకొంటున్న శ్రీరాములు, ప్రవీణ్ అని వినబడేసరికి అంతా గుర్తుకొచ్చింది. ఆరేళ్ల క్రితం వరకూ ఇక్కడే ఎలక్ట్రిసిటీ ఆఫీసులో పనిచేసేవాడు రాజేశ్వర రావు. అతని పిల్లలే ప్రవీణ్, శ్యామల. వాళ్లు చిన్నతనం నుంచి తన దగ్గరే చదువుకొన్నారు. తనే ట్యూషను కూడా చెప్పేవాడు. తరువాత వాళ్లకు ట్రాన్స్ఫర్ కావడంతో ఎక్కడికో వెళ్ళిపోయారు. చిన్నతనం నుంచి తన పర్యవేక్షణలో ఎంతో భయభక్తులతో పెరిగిన ప్రవీణ్ ఇలా తయారయ్యాడంటే ఆయనకు బాధగా ఉంది. అందుకే ఎలాగయినా ప్రవీణ్‌ని దారి మళ్లించాలనుకొన్నాడు. శ్రీరాములు ఈ లోకంలోకి వచ్చేసరికి అప్పటికే లేటయిపోయింది.

ఆ అమ్మాయిని చేయిపట్టుకొని గబుక్కున ముద్దుపెట్టుకున్నాడు ప్రవీణ్.

అంతే. అన్నిటికీ తెగించిన ఆ అమ్మాయి చప్పున చెప్పుతీసి కొట్టింది.

క్షణంలో వాతావరణం మారి పోయింది. అంతా రణగొణధ్వని. మగపిల్లలంతా ఆడపిల్లలపై విరుచుకు పడ్డారు.

"ఒసేయ్. నిన్ను వారం రోజుల్లో రేప్ చేయకపోతే నా పేరు ప్రవీణ్ కాదు" ప్రతిజ్ఞ చేసాడు.

అమ్మాయిలు భయపడి పోయారు. ఎర్రపైట అమ్మాయి ఏడుపు మొదలు పెట్టింది.

అక్కడే ఉన్న శ్రీరాములు ఇక ఉండలేక పోయాడు.

"బాబూ. నీవు రాజేశ్వర రావు అబ్బాయి ప్రవీణ్‌వి కదూ."

"అవును గురువుగారూ. నేను మీకెలా తెలుసు" గర్వంగా అన్నాడు ప్రవీణ్. అతని సంబోధనకు శ్రీరాములు క్షణం ఏమీ మాట్లాడలేక పోయాడు. గురువు శిష్యుడికి తెలియక పోవడమంటూలేదు. చిన్న తనంలో చూసిన పిల్లలు పెద్దయినప్పుడు ముఖ కవళికలు మారిపోయిగుర్తు పట్టడం కష్టమవుతుందేకాని, పెద్దవాళ్లయిన గురువులు ముఖ కవళికలు మారవు. తనెవరో తెలిసీ గర్వంతో అంటున్నాడని అర్థమయింది శ్రీరాములుగారికి.

"చూడు గూరూ. ఈ పిల్ల పొగరు. ఇంతటి మగాడ్ని నన్ను పట్టుకొని ఎన్నెన్ని మాటలు అంటుందో" అన్నాడు తిరిగి.

"ఒరేయ్ నేను శ్రీరాములు మాస్టార్నిరా. చిన్నప్పుడు నీ గురువుని, నా శిష్యుడి వయ్యుండి నువ్విలా తయారయ్యావంటే నాకు చాలా తలవంపులుగా ఉందిరా."

"చాలా సంతోషం కాని, మర్యాదగా మాట్లాడడం నేర్చుకో. నాకు నువ్వొక్కడివే గురువ్వి కాదు. చాలా మంది గురువులున్నారు"

"ఒరే ఎంతమంది గురువులుండి ఏం లాభంరా... నీలాంటి వెధవని శిష్యుడని ఎవరూ చెప్పుకోరురా."

"నా సంగతి పూర్తిగా నీకు తెలియదు. నా స్వంత విషయాల్లో జోక్య చేసుకున్నావంటే అనవసరంగా చిక్కుల్లో పడుతావు. ఏదో పెద్దవాడివిగదాని ఇంత సేపు గౌరవించాను."

"నీకు గౌవరం అంటే ఏమిటో కూడా తెలుసట్రా"

"ఏం ఒళ్లెలా ఉంది" పళ్లు పటపటా కొరికాడు ప్రవీణ్.

"పోలీసు రిపోర్టిచ్చి నీ అంతు తేలుస్తానురా" శ్రీరాములు కూడా అదే కోపంతో అన్నాడు.

"నీ పోలీసు రిపోర్టులు నన్నేమీ చేయలేవు."

"తెగించిన వాడివిరా. నిన్నేంచేయగలవు."

"మర్యాదగా మాట్లాడమని ఇంకోసారి చెబుతున్నాను."

"ఒరే నీ దగ్గరే మర్యాద నేర్చుకోవాలిరా. శుంఠా" అంటూ తుపుక్కున క్రింద ఉమ్మేశాడు శ్రీరాములు.

తీక్షణంగా చూసాడు ప్రవీణ్.

"మాస్టారూ మీరు వాళ్లతో ఘర్షణ పడకండి" బ్రతిమాలారు అమ్మాయిలు.

"మీకు జరిగే అన్యాయాన్ని చూళ్లేక పోయానమ్మా" ఆయన గొంతు వ్యథాపూరిత మయింది.

"ఇది మాకు రోజూ జరిగే తంతే మాష్టారూ. ఇక మీరు మాట్లాడకండి" అన్నారు ఆడపిల్లలు తిరిగి.

ఇంతలో బస్సు రావడం ఆడపిల్లలు ఎక్కడం జరిగింది. వెనుకనే శ్రీరాములు కూడా ఎక్కాడు. బస్సు కదిలింది.

"ముసలోడు తప్పించుకొన్నాడురా. ఏమయితేనేం అమ్మాయిల దగ్గర ఛాన్సు కొట్టాడు." ఎవడో కామెంట్ చేసాడు.

వెనుక నుంచి ఈలలు, చప్పట్లు. వినలేక పోయాడు ఆదర్శ ఉపాధ్యాయుడిగా నేషనల్ అవార్డు పొందిన శ్రీరాములు.

శ్రీరాములు మనసు మనసులో లేదు. తన శిష్యుడు తనను ఇలా అవమాన పరుస్తాడని అతను ఎప్పుడూ అనుకోలేదు. కాని ఈ రోజు ఇది తనకు భరించరాని అవమానం. శ్రీరాములు బస్సుదిగి తన స్నేహితుడు రాజారావు ఇంటివైపు అడుగులు వేసాడు.

ఆయన స్నేహితుడు రాజారావు ఆ మధ్య చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనిషి శుష్కించి సన్నగా తయారయ్యాడు.

స్నేహితుడ్ని చూడగానే కౌగిలించుకొని ఏడ్చాడు రాజారావు. అతన్ని ఓదార్చి, కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఓ గంట తరువాత తిరిగి ప్రయాణమయ్యాడు.

• • •　　　• • •　　　• • •

నేటి యువతీ యువకుల మనోభావాల్ని గురించి ఆలోచిస్తూ నడుసున్న శ్రీరాములకు తనను ఎవరో వెనుక నుంచి పిలిచి నట్లయింది. తిరిగి చూసాడు.

" మాస్టారూ! మస్టారూ!" అంటూ ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయి ఆయన్ను సమీపించింది.

"నేను మాస్టారు! రాజేశ్వరరావుగారి కూతురు శ్యామలను. మండపాల వీధిలో ఉండే వాళ్లం. ఆరేళ్లక్రితం మీ దగ్గర చదువుకొన్నాం నేనూ, మా అన్నయ్య"

శ్రీరాములుకు శ్యామల వినయ విధేయతలకు ముచ్చటేసింది. ఆ అమ్మాయి బి.యస్సీ. రెండవ సంవత్సరం చదువుతున్నట్లు తెలుసుకొని ఎంతో ఆనందించాడు. అంతలోనే ప్రవీణ్ ప్రవర్తన గుర్తొచ్చి మనసు చివుక్కుమంది.

"మా నాన్నకు మళ్ళీ నెల క్రిందట ఇక్కడికే ట్రాన్స్‌ఫరయింది మాస్టారూ. మా ఇంటికి వెళ్దాం రండి" అంది ఎంతో అభిమానంగా.

"శ్యామలా మీ అన్నయ్య ప్రవీణ్ ఏం చేస్తున్నాడమ్మా ఇప్పుడు" సందేహంగా అడిగాడు శ్రీరాములు.

"అన్నయ్య బి.ఏ. పోగొట్టుకొని జులాయిలా తిరుగుతున్నాడు. నాన్న బాధంతా అదే" అంది.

శ్రీరాములు ప్రవీణ్ చేసిన నిర్వాకం విడమరచి చెప్పాడు. శ్యామల చాలా బాధపడింది.

"అన్నయ్య ఇలా చెడిపోతున్నాడనే దిగులు" కన్నీళ్లు పెట్టుకొని అంది.

ఇంతలో కొంత మంది స్టూడెంట్స్ వాళ్ల వెనుక బడ్డారు.

"అరె శ్యామలకు ఇదేం బుద్ధిరా. ఇంత మందిమి మనముంటే ముసలోడ్ని పట్టింది."

"అవున్రా పడుచుపిల్లలు ముసలి వాళ్లంటే పడి చస్తార్రా. వాళ్ల నిదానం మన కుండదుగా."

"ఒరేయ్ ముసలాడికి కోప మొస్తుందేమో"

"కోపం దేనికి అమెరికాలో లేడీ స్టూడెంట్సు ముసలి ప్రొఫెసర్స్ చెట్టాపట్టా లేసుకొని తిరుగుతుండేది మామూలేగా."

వింటున్న శ్రీరాములుకి అలవిగాని కోపమొచ్చింది. ఎక్కడకు పోయినా ఇదే వరుస.

"ఒరేయ్ బుద్ధుందట్రా మీకు. చదువుతున్నారు దేనికిరా. మీకంటే పశువులు మేపుకొనే వాళ్లు నయంరా" ఆగ్రహంగా అరిచాడు.

"అవి మేపుకోడానికి మాకేమీ అభ్యంతరం లేదు ముసలాయనా. కాని ప్రక్కన ఆ పిల్ల ఉంటే చాలు" అంటూ శ్యామల వైపు చూపించాడొకడు.

"శ్యామల ప్రేమికులం మేము. ఆమెను మాకు వదిలేసి వెళ్ళుగురూ. మరీ అంత కోరిక మంచిది కాదు" అన్నాడు మరొకడు.

"ఒరే తుచ్ఛుల్లారా ఆ అమ్మాయి నా శిష్యురాల్రా. నా కూతురు లాంటిది."

"అబ్బ ముసలోడికి ఏంకోపం ముంచుకొస్తోందిరా. తన ప్రియురాల్ననే సరికి"

"మాస్టారు. మీరు అనవసరంగా వాళ్లతో గొడవపడకండి. వాళ్ళు రోడ్డు రోమియోలు"

"ఇన్ని మాటలన్న వాళ్లని ఎలా వదిలి పెట్టేదమ్మా."

"దానికి వేరే మార్గం నేను చెబుతాను మాస్టారూ. ముందు త్వరగా మనం ఇక్కడ నుంచి వెల్దాం పదండి."

"అలా రావాలి దారికి. అహ్హా...హ్హా..." అంటూ నవ్వారు. క్రమేణా వాళ్లు వెళ్ళిపోయారు.

దారిలో అంది శ్యామల. "ఏం చెప్పమంటారు మాస్టారూ. ఈ రోజుల్లో ఆడది బయటికి వస్తే రక్షణ లేకుండా పోతోంది. ఆడవాళ్లు ఎన్ని విషయాల్లో ముందంజ వేసినా ఈ విషయంలో ముందంజ వేయలేక పోతున్నారు. ఇంతకు ముందు ఇలాంటివాళ్ల సంగతి మా అన్నయ్యకు చెప్పేదాన్ని. దాంతో మా అన్నయ్య వాళ్ల తిక్కకుదిర్చేవాడు. కాని ఈ రోజు తెలిసిందేమిటంటే మా అన్నయ్యకు కూడా ఈ ఆడపిల్లల వేటలో వాటా ఉందని. ఇదొక

చక్రం. ఒకడి చెల్లెలు ఇంకొకడి కంటికి రంభలా కనిపిస్తుంది. అది ఈ మగవాళ్లు తెలుసుకుంటే ఏ ఆడపిల్లనూ వేధించరు."

ఇద్దరూ శ్యామల ఇంటికొచ్చారు. మాస్టార్ని హాల్లో కూర్చోబెట్టి వంటగదిలో ఉన్న తల్లిని పిలిచింది. ఆమె వస్తూనే శ్రీరాములుకి నమస్కారం పెట్టి కుశలప్రశ్నలు వేసింది.

ఇంతలో అన్నయ్య వస్తున్నట్లు గమనించిన శ్యామల వరండాలో నిలబడి ప్రవీణ్ దగ్గరకు రాగానే తనను ఈ రోజు అవమాన పరచిన వాళ్ల సంగతి చెప్పింది.

"అయితే నారాయణరావన్న మాట వాడు. గాడిదకొడుకు, వాడిని, వాడి ఫ్రెండ్స్‌ని మక్కెలిరగ బొడుస్తాను. ఎవరను కొన్నాడో ఏమో. నా చెల్లెల్ని అవమాన పరుస్తాడా వాడు" ఇల్లదిరిపోయేట్లు రంకెలు వేసాడు ప్రవీణ్.

తరువాత "చెల్లీ చూస్తుండు. ఉదయాని కల్లా వాడు నీకాళ్లమీద పడి క్షమాపణ కోరేట్లు చేయలేక పోతే నాపేరు ప్రవీణ్ గాదు" అంటూ ఇంట్లోకి నడిచాడు.

ఎదురుగా శ్రీరాములు. అవాక్కయి పోయాడు ప్రవీణ్.

"బాబు ప్రవీణ్. నీ చెల్లెలయితే ఒకటీ, వేరొకరయితే మరొకటీనా."

ఆయన మాటలకు ప్రవీణ్ ముఖం నల్లగా మాడిపోయింది. చెల్లి ముందు తనిలా తలవంచుకోవాల్సి వస్తుందని అతడేనాడూ అనుకొని ఉండలేదు.

"ప్రవీణ్ ఒకటి మాత్రం గుర్తుంచుకో, లేకపోతే జీవితాంతం బాధపడుతావు. నీ చెల్లెలు తప్ప మిగతా ఆడపిల్లలంతా నీతి నియమాలు లేని వాళ్లనుకోకు. నీ చెల్లెలంటే నీకెంత గౌరవమో మిగతా ఆడపిల్లలకు కూడా వాళ్లిళ్లలో అంత గౌరవముందని తెలుసుకో. నీ చెల్లెల్ని ఎలా గౌరవిస్తున్నావో అలాగే మిగతా ఆడపిల్లల్ని కూడా గౌరవించడం నేర్చుకో. ఇలా అందరూ చేసిన నాడు ఆడపిల్లల వేధింపులుండవు. ముందు నీ వరకు నీవు ఆడపిల్లల్ని వేధించనని మాటివ్వు."

అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన అతని తండ్రి శ్రీరాములు మాటల్ని ఆశ్చర్యంగా వింటూంటే, వంటగదిలోంచి వచ్చిన ఆయన భార్య, కుమార్తె ద్వారా ప్రవీణ్ నిర్వాకం విని కొడుకు వైపు అసహ్యంగా చూడ సాగింది.

ప్రవీణ్ తూటాల్లా ఉన్న ఆ అందరి చూపుల్ని భరించలేక పోయాడు.

రెండుచేతులెత్తి శ్రీరాములుగారికి నమస్కారం పెడుతూ, "సార్ తప్పయిపోయింది. క్షమించండి. ఇంకెప్పుడూ ఏ ఆడపిల్లనూ కించపరచను" అన్నాడు.

ఆడపిల్లల్ని వేటాడే ఆటలో తన వాటా వదులుకొన్నట్లు అతని దీనమైన చూపులే చెబుతున్నాయి ✷

**(సుప్రభాతం వీక్లీ, తేది 22-7-2001)**